

ESTD : 1999

# విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY

## ఉమ్మడి కరీంనగర్ జిల్లా

సోమవారం 27 జూలై 2026 | పేజీలు : 10


# వట్టెంల గ్రామంలో కోతుల బెడద

- వీధి దీపాల సమస్య
- విజన్ ఆంధ్ర దినపత్రికతో గ్రామ ప్రజల ఆవేదన



**వేములవాడ జూలై 26 (విజన్ ఆంధ్ర)**

వట్టెంల గ్రామంలో కోతుల బెడద రోజురోజుకూ తీవ్రరూపం దాల్చడంతో పాటు, వార్డులో వీధి దీపాల సమస్య కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో గ్రామ వార్డ్ ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలని

మిగతా 2లో..

# పోరండ్ల విషజ్వరాల బాధిత చిన్నారులను పరామర్శించిన తాటిపర్తి జీవన్ రెడ్డి



2లో..

# రాచపల్లి ఆర్ అండ్ బి ప్రధాన రహదారి దుస్థితి



2లో..

# పర్మిషన్ లేని ప్రైవేట్ హాస్టళ్లు...

విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం!
అడ్డగోలుగా ఫీజుల వసూళ్లు...
నాణ్యత ప్రమాణాలు గాలికి...
మామూళ్ల మత్తులో అధికారులు...
పట్టించుకోని సంబంధిత శాఖలు!

**మెట్ పల్లి జులై 26 (విజన్ ఆంధ్ర ):**

విద్యార్థులకు సురక్షితమైన వసతి కల్పించాల్సిన ప్రైవేట్ హాస్టళ్లలో అనేకం ప్రభుత్వ అనుమతులు లేకుండానే మెట్ పల్లి పట్టణ పరిధిలో యథేచ్ఛగా నడుస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కనీస ప్రమాణాలు పాటించకపోయినా, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని భారీ మొత్తంలో ఫీజులు

మిగతా 2లో..

### జగిత్యాల పట్టణంలో ఏళ్ల తరబడి పాత వాటర్ క్యాన్లు

# ప్రజల ఆరోగ్యంతో చెలగాటమా

**జగిత్యాల ఆర్ సి జూలై 26(విజన్ ఆంధ్ర )**

ప్రతి మనిషి ఆరోగ్యానికి స్వచ్ఛమైన తాగునీరు అత్యంత అవసరం. కానీ

- స్కూళ్లు, ఆస్పత్రులకు పాత క్యాన్లలోనే తాగునీటి సరఫరా
- వాటర్ ప్లాంట్లపై ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని ప్రజల డిమాండ్





మిగతా 2లో..

### కళ్యాణకట్టల్లో....

# 'నగదు' దందాకు చెక్!

- భక్తుల నుంచి డబ్బులు అడిగితే కఠిన చర్యలు తప్పవు
- సామాజిక మాధ్యమాల్లో వైరల్ వీడియోలపై ఈవో ఎల్. రమాదేవి సీరియస్



**వేములవాడ, జూలై 26 (విజన్ ఆంధ్ర):**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలోని కళ్యాణకట్టల్లో భక్తుల నుంచి నగదు వసూళ్లకు పాల్పడుతున్నారంటూ సామాజిక మాధ్యమాల్లో ప్రచారంలోకి వచ్చిన వీడియోలపై దేవస్థానం కార్యనిర్వహణాధికారి (ఈవో) శ్రీమతి ఎల్. రమాదేవి తీవ్రంగా స్పందించారు. కళ్యాణకట్టల్లో విధులు నిర్వహించే నాయి బ్రాహ్మణులు భక్తుల నుంచి నగదు అడగడం లేదా డిమాండ్ చేయడం ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. భక్తుల పట్ల మర్యాదగా వ్యవహరించాలని, ఎవరైనా నగదు డిమాండ్ చేసినట్లు తేలితే బాధ్యులపై కఠినమైన

మిగతా 2లో..

# జగిత్యాల పట్టణంలో ఏళ్ల తరబడి పాత వాటర్ క్యాన్లు ప్రజల ఆరోగ్యంతో చెలగాటమా



(మొదటి పేజీ తరువాయి..)

ప్రజలకు అందుతున్న తాగునీరు నిజంగా సురక్షితమేనా అనే ప్రశ్న రోజురోజుకూ బలపడుతోంది. జగిత్యాల జిల్లాలోని కొన్ని వాటర్ ప్లాంట్లలో ఏళ్ల తరబడి అదే ప్లాస్టిక్ వాటర్ క్యాన్లను వినియోగిస్తూ తాగునీటిని సరఫరా చేస్తున్నట్లు కనిపిస్తోంది. పాఠశాలల్లో విద్యార్థులకు, ఆస్పత్రుల్లో రోగులకు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేట్ సంస్థలకు కూడా ఇదే క్యాన్ల ద్వారా నీరు చేరుతోంది.పాత క్యాన్లపై గీతలు, డెంట్‌లు, అరిగిపోయిన భాగాలు ఏర్పడిన తర్వాత కూడా వాటినే తిరిగి వినియోగించడం పరిశుభ్రతపై సందేహాలకు తావిస్తోంది. ఇటువంటి క్యాన్లను పూర్తిస్థాయిలో శుభ్రపరచడం కష్టమవుతుందని, అందువల్ల తాగునీటి భద్రతపై నిరంతర పర్యవేక్షణ అవసరమని నిపుణులు చెబుతున్నారు.అంతేకాకుండా, వాటర్ ప్లాంట్లలో నీటి శుద్ధి ప్రక్రియ ఎలా జరుగుతోంది. శుద్ధి కోసం ఉపయోగించే రసాయనాలు లేదా ఇతర పదార్థాలు అనుమతించిన ప్రమాణాల ప్రకారమే వాడుతున్నారా వాటి మోతాదును ఎప్పటికప్పుడు పరీక్షిస్తున్నారా తయారైన నీటిని ప్రయోగశాలల్లో క్రమం తప్పకుండా పరీక్షిస్తున్నారాఅనే ప్రశ్నలు కూడా ప్రజల నుంచి వినిపిస్తున్నాయి.ప్రజలకు సరఫరా చేసే ప్రతి నీటి క్యాన్ పరిశుభ్రంగా శానిటైజ్ చేయబడుతున్నదా దెబ్బతిన్న క్యాన్లను సమయానికి తొలగిస్తున్నారా నీటిని నిల్వ చేసే ట్యాంకులను నిర్దిష్ట వ్యవధిలో శుభ్రం చేస్తున్నారా అనే అంశాలపై సంబంధిత శాఖలు ప్రత్యేకంగా దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్న రోగులు తాగే నీటి విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం ప్రదర్శించరాదని వైద్యులు సూచిస్తున్నారు. తాగునీటి నాణ్యతపై అనుమానాలకు తావులేకుండా వాటర్ ప్లాంట్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, నీటి నమూనాలను పరీక్షించడం, క్యాన్ల నాణ్యతను పరిశీలించడం, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత కేవలం వినియోగదారులది కాదు. స్వచ్ఛమైన నీటిని అందించడం వాటర్ ప్లాంట్ యాజమాన్యాల బాధ్యత కాగా, ఆ బాధ్యత సక్రమంగా నిర్వర్తించేలా పర్యవేక్షించడం సంబంధిత అధికారుల కర్తవ్యం. ప్రజల ప్రాణాలకు సంబంధించిన ఈ అంశంపై ఇకనైనా అధికారులు స్పందించి కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## పోరండ్ల విషజ్వరాల బాధిత చిన్నారులను పరామర్శించిన తాటిపర్తి జీవన్ రెడ్డి


**జగిత్యాల ఆర్ సి జూలై 26(విజన్ ఆంధ్ర )**


పోరండ్ల గ్రామంలో విషజ్వరాలతో బాధపడుతున్న చిన్నారుల ఆరోగ్య పరిస్థితిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. విషజ్వరాలతో మరణించిన చిన్నారుల కుటుంబానికి చెందిన మరో చిన్నారులు జగిత్యాల పట్టణంలోని మాతా శిశు కేంద్రంలో చికిత్స పొందుతుండగా, వారిని మరియు వారి కుటుంబ సభ్యులను ఆదివారం పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం పోరండ్ల గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ గ్రామంలోని తాగునీటి నమూనాలను పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపినట్లు తెలిపారు. ప్రస్తుతం గ్రామంలో దాదాపు 20 మంది చిన్నారులు విషజ్వరాలతో బాధపడుతున్నారని వెల్లడించారు.ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ వాతావరణ పరిస్థితుల దృష్ట్యా చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరమన్నారు.గ్రామంలో పారిశుధ్యాన్ని మెరుగుపరచడం అత్యంత కీలకమని, శానిటేషన్ పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని సూచించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులకు ప్రత్యేక వైద్యం అందించి వారి ఆరోగ్యంపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని అధికారులను కోరారు.అలాగే గ్రామంలోని పాఠశాలలో చదువుతున్న మిగతా విద్యార్థులందరికీ వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన చికిత్స అందించాలని సూచించారు. విషజ్వరాల కారణంగా ప్రాణాలు కోల్పోయిన చిన్నారుల కుటుంబాలకు ప్రభుత్వం రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సహాయం ప్రకటించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు వెంకటేశ్వర్ రావు, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, గంగారెడ్డి, రాధాకిషన్, సతీష్, రాము, విష్ణు, శేఖర్‌తో పాటు వివిధ హోదాల్లో ఉన్న పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## పర్మిషన్ లేని ప్రైవేట్ హాస్టళ్లు...

(మొదటి పేజీ తరువాయి..)

వసూలు చేస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి.మెట్ పల్లి పట్టణ పరిధిలో ఉన్న దాదాపు అన్ని ప్రైవేట్ హాస్టళ్లలో తాగునీరు, పరిశుభ్రమైన ఆహారం, భద్రత, అగ్నిమాపక పరికరాలు, సరిపడా గదులు, పారిశుద్ధ్య సౌకర్యాలు వంటి ప్రాథమిక ప్రమాణాలు కూడా లేకుండా కొన్ని హాస్టళ్లు నిర్వహణ కొనసాగిస్తున్నాయనే ఫిర్యాదులు ఉన్నాయి. అయినప్పటికీ సంబంధిత అధికారులు తనిఖీలు నిర్వహించడంలో విఫలమవుతున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.నిబంధనలు ఉల్లంఘిస్తున్న హాస్టళ్లపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కొందరు నిర్వాహకులు అధికారులకు మామూళ్లు చెల్లించడం వల్లే చర్యలు లేకుండా పోతున్నాయంటూ స్థానికంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి.విద్యార్థుల ప్రాణాలకు, ఆరోగ్యానికి ప్రమాదం కలిగించే విధంగా మెట్ పల్లి పట్టణ పరిధిలో నడుస్తున్న పర్మిషన్ లేని హాస్టళ్లపై ప్రభుత్వం, సంబంధిత శాఖలు వెంటనే ప్రత్యేక తనిఖీలు చేపట్టి, అనుమతులు లేని హాస్టళ్లను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.




## కళ్యాణకట్టల్లో.... 'నగదు' దందాకు చెక్!

(మొదటి పేజీ తరువాయి..)

చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.భక్తులకు ఏవైనా ఇబ్బందులు ఎదురైతే సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయకుండా నేరుగా దేవస్థానం కార్యాలయంలో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయాలని ఈవో సూచించారు. ఫిర్యాదులపై విచారణ జరిపి బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ సందర్భంగా కళ్యాణకట్టల్లో విధులు నిర్వహిస్తున్న నాయి బ్రాహ్మణులను ఈవో తన కార్యాలయానికి పిలిపించి ప్రత్యేకంగా మాట్లాడారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విధులు నిర్వహించాలని, నగదు డిమాండ్‌కు పాల్పడరాదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ అసిస్టెంట్ ఈవోలు శ్రీమతి జయకుమారి, శ్రీ నాగుల మహేష్, పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ, రాజేందర్, ఆలయ ఉద్యోగులు, నాయి బ్రాహ్మణులు పాల్గొన్నారు.

## వట్టెంల గ్రామంలో కోతుల బెడద

(మొదటి పేజీ తరువాయి..)

కోరుతూ స్థానిక వార్డ్ సభ్యుడికి వినతిపత్రం సమర్పించారు. గ్రామ పరిసర ప్రాంతాల్లో అడవులు నశించడం, ఆహారం కొరత ఏర్పడడం వల్ల కోతులు గుంపులుగా గ్రామంలోకి చొరబడి పంటలను ధ్వంసం చేయడంతో పాటు ప్రజలపై దాడులకు కూడా పాల్పడుతున్నాయని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. చిన్నపిల్లలు, మహిళలు, వృద్ధులు బయటకు వెళ్లేందుకు భయపడే పరిస్థితి నెలకొన్నదని తెలిపారు. కోతుల సమస్యను అటవీ శాఖ అధికారులు వెంటనే గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే, తమ వార్డులో వీధి దీపాలు లేకపోవడం లేదా పాడైపోవడం వల్ల రాత్రి వేళల్లో తీవ్ర చీకటి నెలకొంటోందని పేర్కొన్నారు. దీంతో దొంగతనాల భయం పెరగడంతో పాటు పాములు, తేళ్లు వంటి విషజంతువుల సంచారం కూడా అధికమై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, చిన్నారులు రాత్రి సమయంలో బయటకు రావడానికి భయపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాబట్టి, సంబంధిత అధికారులు స్పందించి కోతుల బెడద నివారణకు చర్యలు చేపట్టడంతో పాటు, వార్డులో తక్షణమే కొత్త వీధి దీపాలు ఏర్పాటు చేయాలని లేదా పాడైపోయిన దీపాలను మరమ్మతు చేసి ప్రజలకు సురక్షిత వాతావరణం కల్పించాలని వార్డ్ ప్రజలు విజ్ఞప్తి చేశారు.

## రాచపల్లి ఆర్ అండ్ బి ప్రధాన రహదారి దుస్థిత

**గుంతలమయమైన రోడ్డుతో నిత్యం నరకయాతన..**

**ప్రమాదాల బారిన పడుతున్న ప్రజలు**

**తక్షణమే మరమ్మతులు చేపట్టాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు గ్రామస్తుల విజ్ఞప్తి**

**ఇల్లందకుంట జూలై 26 (విజన్ ఆంధ్ర)**

కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండలం రాచపల్లి గ్రామంలోని ఆర్ అండ్ బి ప్రధాన రహదారి పూర్తిగా దెబ్బతిని గుంతలమయంగా మారింది. రహదారి అధ్వాన్న పరిస్థితికి చేరుకోవడంతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోజూ ఈ రహదారిపై ప్రయాణించే విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు, మహిళలు, వృద్ధులు, వాహనదారులు నిత్యం అవస్థలు పడుతున్నారు.వర్షాలు కురిసిన ప్రతిసారి రోడ్డుపై నీరు నిలిచిపోవడంతో గుంతలు కనిపించక ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌లు, ఇతర వాహనాలు సైతం ఈ రహదారిపై ప్రయాణించేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని వారు తెలిపారు.ఈ రహదారి గ్రామానికి ప్రధాన మార్గం అయినప్పటికీ ఇప్పటి వరకు మరమ్మతులు చేపట్టకపోవడం పట్ల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు చేపట్టలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.ఇప్పటికైనా సంబంధిత ఆర్ అండ్ బి శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి రహదారిని పరిశీలించి తక్షణమే మరమ్మతు పనులు ప్రారంభించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. గ్రామ ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని శాశ్వత పరిష్కారం చూపాలని, నాణ్యమైన రహదారిని నిర్మించాలని వారు కోరుతున్నారు.



# సమాజ సేవకు జాతీయ గుర్తింపు..

## అన్నపూర్ణమ్మ ఫౌండేషన్ సభ్యులకు 'బెస్ట్ సోషల్ వర్కర్--2026' నేషనల్ అవార్డు



**జూలై 26, విజన్ ఆంధ్ర**

సమాజ సేవలో విశేష కృషి చేస్తున్న అన్నపూర్ణమ్మ ఫౌండేషన్ సభ్యులకు ప్రతిష్ఠాత్మక 'బెస్ట్ సోషల్ వర్కర్ -- 2026' నేషనల్ అవార్డు లభించింది. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బహుజన సాహితీ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో ఈ గౌరవాన్ని అందజేశారు.బహుజన సాహితీ అకాడమీ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ, నేషనల్ జనరల్ సెక్రటరీ డాక్టర్ యు. సుబ్రహ్మణ్యం సమక్షంలో, ముఖ్య అతిథిగా పాల్గొన్న సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి వద్లూరి లక్ష్మణ్ చేతుల మీదుగా ఫౌండేషన్ సభ్యులు ఈ ప్రతిష్ఠాత్మక జాతీయ అవార్డును అందుకున్నారు. అవార్డు గ్రహీతలుగా కుర్ర సావిత్రి, బొప్ప విజయలక్ష్మి, బొప్ప పద్మలత, మద్ది వేణి, స్వరూప, పిల్లల మరి విజయలను సన్మానించారు. సమా జంలో పేదలు, మహిళలు, వృద్ధులు, నిరుపేద కుటుంబాల సంక్షేమం కోసం వారు అందిస్తున్న సేవలను గుర్తించి ఈ అవార్డును ప్రదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలు మాట్లాడుతూ, తమ సేవలను జాతీయ స్థాయిలో గుర్తించడం ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు.భవిష్యత్తులో కూడా మరింత అంకితభావంతో సేవా కార్యక్రమాలను విస్తరించి, సమాజానికి మరింత ఉపయోగపడే విధంగా పనిచేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సామాజిక సేవకులు, సాహితీవేత్తలు, ప్రజాప్రతినిధులు, ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొని అవార్డు గ్రహీతలను అభినందించారు.

# కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ

## -అమర జవాన్ల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి భారతీయుడి బాధ్యత - క్లబ్ అధ్యక్షురాలు డా. శరణ్య యాదవ్.




**రామగిరి జూలై 26(విజన్ ఆంధ్ర )**

కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీ కాలనీ ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్గిల్ యుద్ధంలో దేశ రక్షణ కోసం ప్రాణాలను అర్పించిన అమర జవాన్లకు ఘన నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు డా. శరణ్య యాదవ్ మాట్లాడుతూ, కార్గిల్ యుద్ధంలో దేశ రక్షణ కోసం ప్రాణాలను అర్పించిన అమర జవాన్ల త్యాగం ఎప్పటికీ మరువలేనిదని అన్నారు. దేశ సరిహద్దుల్లో ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటూ దేశం కోసం పోరాడిన సైనికుల ధైర్యసాహసాలు, దేశభక్తి ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని తెలిపారు. వీర జవాన్ల త్యాగాలను స్మరించు కోవడం, వారి కుటుంబాలను గౌరవించడం ప్రతి భారతీయుడి బాధ్యత అని పేర్కొన్నారు. యువతలో దేశభక్తి భావాన్ని పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడం ఎంతో అవసరమని, దేశం కోసం ప్రాణాలర్పించిన వీర సైనికుల త్యాగాలను మనం ఎప్పటికీ మరువ కూడదని డా. శరణ్య యాదవ్ అన్నారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ పాస్ట్ ప్రెసిడెంట్ మొల్మూరి శ్రీనివాస్, మేకల మారుతి యాదవ్, కోశాధికారి టి.వి. సురేష్ బాబు, క్లబ్ చైర్‌పర్సన్ గంట వెంకట రమణ రెడ్డి, బూదర్తి బుచ్చన్న పటేల్, అలాగే వైస్ ప్రెసిడెంట్ కోట రవీందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ తోట చంద్రయ్య, కొప్పుల సునీల్, ఒర్రె మల్లయ్య, జానీ, నజీమ్, సదానందం, తిరుమల్ తదితరులు పాల్గొన్నారు.

# వంతెన ఆలస్యంపై వినూత్న నిరసన

## మా మాట ఎవరు వింటారు అంటూ మోదీకి ప్రశ్న

**కరీంనగర్, జూలై 26 విజన్ ఆంధ్ర**



కరీంనగర్‌లో రైల్వే వంతెన నిర్మాణం ఆలస్యంపై సామాజిక కార్యకర్తలు కోట శ్యామ్ కుమార్, బెల్లపు కరుణాకర్ శనివారం వినూత్న నిరసన చేపట్టారు.రైల్వే పట్టాల వద్ద కూర్చొని ప్రధాని "మన్ కీ బాత్" కార్యక్రమం వింటూ,మేము మీ మాట వింటున్నాం. మరి మా బాధ ఎవరు వింటారుఅంటూ ప్రశ్నించారుగత 5 సంవత్సరాలుగా వంతెన పనులు పూర్తికాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. రైల్వే గేటు పడినప్పుడు అంబులెన్స్‌లకు దారి లేక పలువురు ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేశారు. రోడ్డుపై ఫీట్ల లోతు గోతులు ఏర్పడ్డాయని, వర్షం పడితే మోకాళ్ల లోతు నీరు నిలుస్తుందని తెలిపారు. కాంట్రాక్టర్లు కనీస మరమ్మతులు కూడా చేయడం లేదని మండిపడ్డారునగరాన్ని అభివృద్ధి చేస్తున్నామని చెప్పే నాయకులు ఈ దారిని పట్టించుకోవడం లేదు. పక్కదారి నుంచి వెళుతున్నారు" అని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరగా ప్రధాని మోదీకి అంకితంగా పాట పాడి, వంతెన పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

# పేకాటస్థావరంపై పోలీసుల దాడి

## 12 మందిపై కేసు నమోదు.

**చిగురుమామిడి(జూలై 26): విజన్ ఆంధ్ర :**

చిగురుమామిడి మండలంలోని రేకొండ గ్రామ పరిధిలో గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న పేకాట స్థావరంపై చిగురుమామిడి ఎస్.ఐ జగదీశ్వర్ ఆధ్వర్యంలో శనివారం అర్ధరాత్రి దాడి నిర్వహించారు.నమ్మదగిన సమాచారం మేరకు పోలీసులు జరిపిన ఈ దాడిలో మొత్తం 12 మంది పేకాటరాయుళ్లను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొని అరెస్ట్ చేశారు.వారి వద్ద నుండి 26 వేల రూపాయల నగదుతోపాటు,జూదానికి ఉపయోగిస్తున్న 11స్మార్ట్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ,అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని ఎస్.ఐ జగదీశ్వర్ హెచ్చరించారు.నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ తెలిపారు.

# చేయి చేయి కలుపుదాం.. సేవ చేయ కదులుదాం....

## గీతా విద్యాలయం పూర్వ విద్యార్థుల సంకల్పం.

## మిత్ర ఫౌండేషన్ పేరుతో సేవా కార్యక్రమాలకు శ్రీకారం.




**జగిత్యాల, జూలై 26 (విజన్ ఆంధ్ర జిల్లా బ్యూరో):**

చేయి చేయి కలుపుదాం సేవ చేయ కదులుదాం... ప్రజల కొరకే మనమంతా ప్రతి నిమిషం బ్రతుకుదాం.. అంటూ శ్రీ సరస్వతీ విద్యాపీఠం అనుబంధ గీత విద్యాలయం పూర్వ విద్యార్థులు "మిత్ర ఫౌండేషన్" పేరుతో సేవా సంస్థకు శ్రీకారం చుట్టారు. జగిత్యాల గీత విద్యాలయంలో విద్యనభ్యసించిన 1994- 95 పదవ తరగతి బ్యాచ్ కు చెందిన 53 మంది పూర్వ విద్యార్థులు వివిధ వృత్తుల్లో స్థిరపడి సమాజం కోసం ఏదైనా సేవ చేయాలి అనే సంకల్పంతో "మిత్ర ఫౌండేషన్" ను స్థాపించి గీతా విద్యాలయం లో తమకు విద్యాబుద్ధులు నేర్పి తమ ఉన్నతికి కారణమైన పూర్వ ఆచార్యుల సమక్షంలో సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఆదివారం స్థానిక గీతా గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో గీతా విద్యాలయం పూర్వ ప్రధాన ఆచార్యులు న్యాలమడుగు శంకరయ్య చేతులమీదుగా సంస్థ లోగోను, రాంబ్రహ్మం ఆచార్య చేతుల మీదుగా వెబ్ సైట్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గీతా విద్యాలయంలో చదివి వివిధ రంగాలలో స్థిరపడ్డ విద్యార్థులు తాము పాఠశాలలో నేర్చుకున్న సంస్కారంతో సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం అభినందనీయం అన్నారు. తమ ఎదుగుదలకు కారణమైన పాఠశాలను మరువకుండా గీత విద్యాలయంలోని చిన్నారుల కోసం ఆట వస్తువులను అందజేయడం జరిగిందన్నారు. "ఒక్కరి కోసం అందరూ.. అందరి కోసం ఒక్కరు" అనే భావనతో పనిచేస్తూ మిత్ర ఫౌండేషన్ సేవలను మరింత విస్తృత పరచాలని ఆకాంక్షించారు. మిత్ర ఫౌండేషన్ నిర్వాహకులు మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా సమాజంలోని నిరుపేదలు, నిరాశ్రయులకు విద్య, వైద్య సహకారంతోపాటు కెరీర్ గైడెన్స్ లో తమ సంస్థ ద్వారా సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ ప్రధానాచార్యులు న్యాలమడుగు శంకరయ్య, రాంబ్రహ్మం, ఎన్నమనేని అశోకరావు, కమలాకర్ రావు, లక్ష్మణరావు, మహిపాల్ రెడ్డి, శివకుమార్, శ్రీనివాసరావు, భగిని నివేదిత ఆవాసం కార్యదర్శి కవోష్ణ, మిత్ర ఫౌండేషన్ సభ్యులు వి. రామకృష్ణారెడ్డి, బి.సుమన్ రావు, గోపాల్ రెడ్డి, పాక శ్రీనివాస్, నక్కల రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### రాజన్న ఆలయానికి నిధుల వరద..

# రూ.99.40 కోట్లు మంజూరు

**మొత్తం రూ.249.40 కోట్లకు చేరిన అభివృద్ధి నిధులు**

**వేములవాడకు మహర్దశ.. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కృషి అభినందనీయం: మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు**



**వేములవాడ, జూలై 26 (విజన్ ఆంధ్ర):** దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధి, విస్తరణ పనులకు రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.99.40 కోట్ల నిధులను మంజూరు చేసింది. తాజా నిధుల కేటాయింపుతో రాజన్న ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం మంజూరు చేసిన మొత్తం నిధులు రూ.249.40 కోట్లకు చేరుకున్నాయి. ఈ మేరకు సంబంధిత శాఖ అధికారులు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.రాజన్న ఆలయానికి భారీగా నిధులు మంజూరు కావడంపై వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్, పాలకవర్గ కౌన్సిలర్లతో కలిసి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. అనంతరం ఆలయ అభివృద్ధి, పట్టణంలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులపై చర్చించారు.ఆది శ్రీనివాస్ కృషితోనే భారీ నిధులు మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ వేములవాడ పుణ్యక్షేత్రానికి మహర్దశ పట్టిందని ఆనందం వ్యక్తం చేశారు. రాజన్న ఆలయ అభివృద్ధికి రూ.249.40 కోట్ల భారీ నిధులు మంజూరు కావడం వెనుక ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ నిరంతర కృషి, పట్టుదల ఉందని కొనియాడారు.వేములవాడ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు, నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖతో పాటు ఇతర మంత్రులకు మున్సిపాలిటీ, పట్టణ ప్రజల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

***45 శాతం పనులు పూర్తి***

దేశంలోని ప్రముఖ శైవక్షేత్రాల్లో ఒకటైన రాజన్న ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం దశలవారీగా నిధులు కేటాయిస్తోందని పుల్కం రాజు తెలిపారు. 2023-24 బడ్జెట్‌లో రూ.50 కోట్లు, 2024-25 బడ్జెట్‌లో రూ.100 కోట్లు కేటాయించగా, తాజాగా మరో రూ.99.40 కోట్లు మంజూరు చేసినట్లు వివరించారు.ఈ నిధులతో ఆలయ విస్తరణ, మౌలిక వసతుల కల్పన తదితర పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఇప్పటికే సుమారు 45 శాతం పనులు పూర్తయ్యాయని, అభివృద్ధి పనులు పూర్తయితే భక్తులకు మెరుగైన, ఆధునిక సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని అన్నారు.

ఆలయ అభివృద్ధితో వేములవాడ ఆధ్యాత్మిక కేంద్రంగానే కాకుండా ప్రముఖ పర్యాటక ప్రాంతంగా కూడా మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉందని పుల్కం రాజు ఆశాభావం వ్యక్తం చేశారు.

***శృంగేరి పీఠాధిపతుల సూచనలతో పనులు***

అనంతరం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాజన్న ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. శృంగేరి పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతి స్వామివారి సలహాలు, సూచనలను పరిగణనలోకి తీసుకుని ఆలయ అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు.

## వితన మేళాను సద్వినియోగం చేసుకోవాలి

### -మండల వ్యవసాయ అధికారి లావణ్య

**మల్లాపూర్, జూలై 26 (విజన్ ఆంధ్ర):** మండలంలోని మొగిలిపేట గ్రామంలో రైతు వేదిక వద్ద నిర్వహించే విత్తనమేల కార్యక్రమానికి రైతులు హాజరై సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి లావణ్య ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎల్ నినో ప్రభావంతో రైతులు ఆరుతడి పంటల పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. రైతులు పెద్ద ఎత్తున హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## వర్షాలు కురవాలని పోచమ్మ తల్లికి,వాన దేవునికి ప్రత్యేక పూజలు చేసిన గ్రామ సర్పంచ్, ప్రజలు



**పెద్దపల్లి ఓదెల జులై 26,(విజన్ ఆంధ్ర)**

పెద్దపల్లి జిల్లా హరిపురం గ్రామంలో ఆదివారం సర్పంచ్ గ్యారవేని విజయ నాగరాజు యాదవ్ ఆధ్వర్యంలో గ్రామదేవత,పోచమ్మ తల్లికి, వరుణ దేవునికి ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు సుభిక్షంగా ఉండాలని, గ్రామంలో చెరువులు,కుంటలు నిండి పాడిపంటలు సమృద్ధిగా పండాలని,రైతులకు మంచి దిగుబడులు రావాలని, గ్రామ ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని భక్తిశ్రద్ధలతో ప్రార్థించామన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మాటూరి మహేందర్,గ్రామ నాయకులు జైపాల్ రెడ్డి,ముప్పు రాకేష్, మారబోయిన పర్వతాలు,కొండాల్ రెడ్డి,తుమ్మల లక్ష్మయ్య,చంద్రయ్య,బేరం అనిల్,తోట్ల హరీష్, గ్యారవేని అనిల్,పవన్,ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.అనంతరం గ్రామ పెద్దలు, రైతులు, మహిళలు, ప్రజాప్రతినిధులు మరియు గ్రామస్థులు పోచమ్మ తల్లి ఆశీస్సులు పొందుతూ గ్రామాభివృద్ధి, రైతాంగ సంక్షేమం, ప్రజల సుభిక్షం కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

## వివిధ కుల సంఘాల బోనాల వేడుకల్లో పాల్గొన్న బీజేపీ జగిత్యాల నియోజకవర్గ ఇంచార్జి డా. భోగ శ్రావణి

### భక్తిశ్రద్ధలతో బోనం సమర్పించి అమ్మవారికి ప్రత్యేక పూజలునిర్వహించిన్న శ్రావణి

**జగిత్యాల ఆర్ సి జులై 26(విజన్ ఆంధ్ర )**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిర్వహించే బోనాల పండుగ సందర్భంగా జగిత్యాల పట్టణం, పరిసర ప్రాంతాల్లో వివిధ కుల సంఘాలు, కాలనీల ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ మైసమ్మ, పోచమ్మ, ఎల్లమ్మ తల్లుల బోనాల వేడుకల్లో బీజేపీ జగిత్యాల నియోజకవర్గ ఇంచార్జి డా. భోగ శ్రావణి పాల్గొన్నారు.ఈ సందర్భంగా సంప్రదాయ వస్త్రధారణలో మహిళలతో కలిసి బోనం ఎత్తుకుని ఊరేగింపులో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయాల్లో దర్శనం చేసుకుని రాష్ట్ర ప్రజలందరికీ ఆయురారోగ్యాలు సుఖసంతోషాలు సుభిక్షం కలగాలని ప్రార్థించారు. సందర్భంగా డాక్టర్ . భోగ శ్రావణి మాట్లాడుతూ తెలంగాణ ఆత్మను ప్రతిబింబించే బోనాల పండుగను ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం సంతోషకరమని అన్నారు. కుల, మతాలకు అతీతంగా ప్రజలంతా కలిసి ఇలాంటి సాంప్రదాయ ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం సమాజంలో ఐక్యతను పెంపొందిస్తుందని పేర్కొన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రతి కుటుంబం ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు.వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన బోనాల కార్యక్రమాల్లో స్థానిక మహిళలు, యువత, పెద్దలు, భక్తులతో కలిసి పాల్గొన్న ఆమెకు నిర్వాహకులు ఘన స్వాగతం పలికి శాలువాలతో సన్మానించారు.ఈ కార్యక్రమాల్లో బీజేపీ నాయకులు కశెట్టి తిరుపతి, పుష్ప రెడ్డి, సూదుల ఉమారాణి, స్థానిక నాయకులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, వార్డు మహిళలు, పార్టీ కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఘనంగా బోనాల పండుగ ఉత్సవాలు

**జగిత్యాల ఆర్ సి జులై 26(విజన్ ఆంధ్ర )**



జగిత్యాల పట్టణ మేర సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల మహోత్సవం భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా జరిగింది. ఈ వేడుకలకు జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి అడువాల జ్యోతి లక్ష్మణ్, మాజీ జెడ్పీ చైర్మన్ దావా వసంత సురేష్, జగిత్యాల నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్ బోగ శ్రావణి ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, రాష్ట్ర ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, సమృద్ధి కలగాలని ప్రార్థించారు. బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొంటూ, ఇలాంటి ఆధ్యాత్మిక వేడుకలు సమాజంలో ఐక్యతను, భక్తి భావాన్ని పెంపొందిస్తాయని అన్నారు.కార్యక్రమంలో మేర సంఘం అధ్యక్షులు ఉపాధ్యక్షులు మరియు ప్రధాన కార్యదర్శి కార్యవర్గ సభ్యులు, ప్రజాప్రతినిధులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు.

# చేవెళ్ల అంబేద్కర్ అభయహస్తం ఎక్కడ..?

## మాట తప్పిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించాలి: మైస ఉపేందర్ మాదిగ



**జగిత్యాల జులై 26 (విజన్ ఆంధ్ర జిల్లా బ్యూరో):** చేవెళ్ల ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన అంబేద్కర్ అభయహస్తం హామీని వెంటనే అమలు చేయాలని మాదిగ హక్కుల పరిరక్షణ సమితి (ఎంహెచ్‌పీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు మైస ఉపేందర్ మాదిగ డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు రూ.12 లక్షల ఆర్థిక సాయం అందిస్తామని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు రెండేళ్లు గడుస్తున్నా హామీ అమలుపై స్పష్టత ఇవ్వలేదని ఆయన విమర్శించారు. ఆదివారం జగిత్యాల ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, చేవెళ్ల డిక్లరేషన్‌లో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి అంబేద్కర్ అభయహస్తం అమలు చేస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటి వరకు చర్యలు చేపట్టకపోవడం దళితులను నిరాశకు గురి చేసిందన్నారు. దళితుల అభివృద్ధి కోసం ప్రభుత్వం వెంటనే అంబేద్కర్ అభయహస్తం అమలు చేసే వరకు మాదిగ హక్కుల పరిరక్షణ సమితి ఉద్యమాన్ని కొనసాగిస్తుందని ఉపేందర్ మాదిగ స్పష్టం చేశారు. ఈ అంశంపై ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి ఆగస్టు 21న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి ప్రజా సంఘాలు, రాజకీయ నాయకులు పెద్ద ఎత్తున హాజరుకావాలని పిలుపునిచ్చారు. జగిత్యాల జిల్లా నూతన జిల్లా అధ్యక్షుడిగా బొమ్మన తిరుపతి మాదిగను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు ఈ సందర్భంగా ప్రకటించారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం దళిత బంధు పేరిట రూ.10 లక్షలు అందించిందని, ప్రస్తుత ప్రభుత్వం పేరు మార్చి అంబేద్కర్ అభయహస్తంగా ప్రకటించినప్పటికీ అమలులో మాత్రం పురోగతి కనిపించడం లేదని ఆరోపించారు. ఎన్నికల హామీ మేరకు ప్రతి దళిత కుటుంబానికి రూ.12 లక్షల ఆర్థిక సాయం అందించి, ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు.

**ప్రధాన డిమాండ్లు**

– రాష్ట్రంలోని దళితులకు అంబేద్కర్ అభయహస్తం పథకాన్ని వెంటనే అమలు చేయాలి. – తెలంగాణలో ఎస్సీ రిజర్వేషన్లను జనాభా దామాషా ప్రకారం 20 శాతానికి పెంచాలి. – నిరుద్యోగులకు తక్షణమే రూ.4 వేల నిరుద్యోగ భృతి అందించాలి. – తెలంగాణ ఉద్యమకారులకు స్థలాలు కేటాయించి డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇవ్వాలి. – ఎస్సీ కార్పొరేషన్‌ను మూడు భాగాలుగా విభజించి వెంటనే చైర్మన్లను నియమించాలి. – మాదిగ జర్నలిస్టులకు స్థలాలు కేటాయించి డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేయాలి. – ఎస్సీ ఇండస్ట్రియల్ సబ్సిడీ నిధులను తక్షణమే విడుదల చేయాలి. ఈ విలేకరుల సమావేశంలో ఎంహెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు సుంకె ప్రభాకర్, దొనకొండ శ్రీనివాస్, పిట్ల వెంకన్న, గుజ్జెరి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



# మడేలేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి చేయూత..

## రూ.50,116 విరాళం అందించిన ఏనుగు మనోహర్ రెడ్డి కుటుంబం

## కృతజ్ఞతలు తెలిపిన రజక సంఘం నాయకులు

**వేములవాడ జూలై 26 (విజన్ ఆంధ్ర )** వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజ్‌పల్లి గ్రామ శ్రీ మడేలేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి వారి కుటుంబ సభ్యులు ఆదివారం రూ.50,116 విరాళంగా అందజేశారు. ఆలయ నిర్మాణ పనులకు చేయూతగా అందించిన ఈ విరాళాన్ని ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు స్వీకరించారు. ఆలయ నిర్మాణానికి ఉదారంగా విరాళం అందించిన ఏనుగు మనోహర్ రెడ్డి కుటుంబ సభ్యులకు శాత్రాజ్‌పల్లి రజక సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ఆధ్యాత్మిక అభివృద్ధికి తోడ్పడే ఉద్దేశంతో ఆలయ నిర్మాణానికి ముందుకు వచ్చిన ఏనుగు మనోహర్ రెడ్డి కుటుంబం సేవాభావానికి నిదర్శనమని కొనియాడారు. సమాజంలో ఇటువంటి సేవా కార్యక్రమాలు మరెందరికో ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షులు వనపర్తి గంగయ్య, పొన్నాల మోహన్, మాజీ ఉపసర్పంచ్ చింతలతాడం మల్లయ్య, వనపర్తి మల్లేశం, కొన్నాల రఘుపతి, వనపర్తి జగన్, పొన్నాల మల్లేశం, రజక సంఘ సభ్యులు, యువజన సంఘ సభ్యులు, పి.ఎ.సి.ఎస్ చైర్మన్ ఏనుగు తిరుపతి రెడ్డి, అడ్వకేట్ గుడిసె సదానందం, మ్యాకల శ్రీనివాస్, రేగుల రాజేశం, నల్ల సతీష్ రెడ్డి, వికుర్తి సాయిబాబు, మిట్టపల్లి అనిల్, గుడిసె అనిల్, గుడిసె పురుషోత్తం, బండ మహేందర్, గుడిసె దాసు, బండి అనిల్, నాగి సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

